
సాక్షి పల్నాడు
గురువారం । 11 । జూలై । 2024



దుర్గమ్మ సేవలో దేవదాయ మంత్రి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కుటుంబం బుధవారం దర్శించుకుంది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 503.20 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.

విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని గాంధీ చౌక్‌వద్ద గల విఘ్నేశ్వర ఆలయంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి రజిత కవచ ప్రత్యేక అలంకారం చేపట్టి విశేష అభిషేకాలు నిర్వహించారు.

మశక చీకట్లు

జరభద్రం

- దోమకాటుతో ప్రాణాంతక వ్యాధులు
- సీజనల్ రోగాలూ పొంచి ఉన్నాయి
- ముందస్తు చర్యలతోనే రక్షణ



గుంటూరులో ఇటీవల కురిసిన వర్షానికి జలమయమైన రోడ్డు (ఫైల్)

గుంటూరు మెడికల్: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల సీజన్ ప్రారంభమైనట్లే. ఈ కాలంలో జాగ్రత్తలు పాటించకుంటే రోగాలబారిన పడడం ఖాయం. దోమలు పెరిగేందుకూ అనుకూలమైన కాలం ఇది. దోమ చిన్నదే కానీ దాని కాటు వల్ల వచ్చే వ్యాధులు మాత్రం ప్రమాదకరం. డెంగీ, చికున్ గున్యా, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు తదితర రోగాలు దోమకాటు వల్లే ప్రబలుతాయి. వీటిపై అవగాహన కలిగి ఉండి సరైన జాగ్రత్త చర్యలు పాటిస్తే వ్యాధులబారిన పడకుండా ఉండగలం. దోమకాటు వల్ల సంభవించే కొన్ని వ్యాధుల గురించి స్థూలంగా తెలుసుకుందాం.

➡ డెంగీ : ఎడిస్ ఈజిప్టి దోమకాటు వల్ల ఇది సోకుతుంది. తీవ్రజ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, కండరాలు, ఎముకల నొప్పులు, ఆకలి మందగించటం, శరీరంపై దద్దుర్లు, ముక్కు, మలం ద్వారా రక్తం పోవటం తదితర లక్షణాలు డెంగీ సోకిన వారిలో కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపించగానే వైద్యుడిని సంప్రదించి సరైన చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదు.

➡ చికున్ గున్యా: డెంగీ లక్షణాలన్నీ ఈ వ్యాధి సోకిన వారిలోనూ ఉంటాయి. రక్తస్రావం మాత్రం ఉండదు. తీవ్రమైన ఒళ్లునొప్పులు దీర్ఘకాలం ఉంటాయి. జిల్లాలో మూడేళ్లుగా ఎలాంటి కేసులూ నమోదు కాలేదని వైద్యాధికారులు తెలిపారు. జిల్లాలో 2013లో చికున్ గున్యా బాధితులు అధిక సంఖ్యలో నమోదు కావడంతో అప్పట్లో వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ ఎమర్జన్సీని ప్రకటించింది.

➡ మలేరియా: ఎనాఫిలిస్ దోమ కుట్టడం వల్ల మలేరియా సోకుతుంది. విపరీతమైన చలిజ్వరం ఉంటుంది. జ్వరం తగ్గినప్పుడు చెమట పోస్తుంది. వ్యాధి లక్షణాలు పూర్తిగా బయటపడేందుకు రెండువారాలు పడుతుంది. జ్వరం వచ్చినప్పుడు ఎలాంటి మందులూ వాడకుండా రక్తపరీక్ష చేయిస్తే మలేరియా ఉందో లేదో తెలుస్తుంది. సరైన వ్యాధి నిర్ధారణ, చికిత్స చేయకపోతే నెలల తరబడి వేధిస్తుంది.

నాలుగేళ్లుగా నమోదైన డెంగీ కేసులు ఇలా..

సంవత్సరం	కేసులు
2021	447
2022	168
2023	375
2024	120 (జూన్ వరకు)

మూడేళ్లుగా నమోదైన మలేరియా కేసులు

సంవత్సరం	కేసులు
2022	24
2023	21
2024	5 (మే వరకు)

➡ మెదడువాపు: క్యూలెక్స్ దోమ కాటు వల్ల ఈ వ్యాధి వస్తుంది. ఎక్కువగా 15 ఏళ్లలోపు పిల్లలకు వస్తుంది. చిన్నప్పుడే వ్యాక్సిన్ వేయించటం వల్ల వ్యాధి వచ్చే అవకాశం తక్కువ. జ్వరం వచ్చి తగ్గుతూ ఉండటం ఈ వ్యాధి లక్షణం. తగిన చికిత్స చేయించకపోతే పక్షవాతం, ఫిట్స్ వచ్చి శాశ్వతంగా అంగవికలురుగా మారే ప్రమాదం ఉంది. జిల్లాలో మూడేళ్లుగా కేసులు నమోదు కాలేదని వైద్యాధికారులు తెలిపారు.

➡ అతిసారం: వర్షాకాలం వచ్చే వ్యాధుల్లో అతిసారం ప్రధానమైంది. కలుషిత నీరు, అపరిశుభ్రత వల్ల ఇది సోకుతుంది. వాంతులు, విరేచనాలు, నిస్సత్తువ ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. వెంటనే వైద్యం చేయించకపోతే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ప్రస్తుతం ప్రతిరోజూ జిల్లా వ్యాప్తంగా 20 నుంచి 30 డయేరియా కేసులు నమోదవుతూనే ఉన్నాయి. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ కలుషిత నీరు, ఆహారపదార్థాలకు దూరంగా ఉండాలి.

వర్షాకాలంలో చేపట్టాల్సిన జాగ్రత్తలు

- ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.
- ఇంటి ఆవరణలో ఖాళీకొబ్బరి చిప్పలు, కొబ్బరి బొండాలు, పాత టైర్లు, రోళ్లలో నీటి నిల్వలు లేకుండా చూడాలి.
- ఎయిర్ కూలర్‌లలో, పూలకుండీలలో నీటిని మూడురోజులకు ఒకసారి మార్చాలి.
- ఓవర్‌హెడ్ ట్యాంక్‌లకు మూతలు బిగించాలి.
- వారానికి ఒకసారి నీటి గుంటలలో కిరోసిన్, మడ్డి ఆయిల్ చల్లించాలి.
- ఉదయం, సాయంత్రం వేళల్లో కిటికీలు, తలుపులు మూసి ఉంచాలి.
- దోమల నియంత్రణ చర్యలు తీసుకోవాలి.
- దోమతెరలు తప్పనిసరిగా వాడాలి.

జ్వరం రాగానే కంగారు అనవసరం



సీజన్ మారగానే సహజంగా జ్వరాలు వస్తాయి. జ్వరం రాగానే కంగారు పడకుండా ఉండాలి. ఏ జ్వరమో తెలియకుండా ముందస్తుగా మాత్రలు వేసుకోకూడదు. వ్యాధి నిర్ధారణ తర్వాతే మందులు వాడాలి. వైద్యులు రాసే మందులే తీసుకోవాలి. సొంత వైద్యం పనికి రాదు. మెడికల్ షాపు వాళ్లు ఇచ్చే మందులు వేసుకుంటే సైడ్ ఎఫెక్ట్‌ల వల్ల ఒక్కోసారి ప్రాణాలు పోతాయి. తస్మాత్ జాగ్రత్త.

– డాక్టర్ కోగంటి కళ్యాణ్ చక్రవర్తి, జ్వరాల స్పెషలిస్ట్, గుంటూరు

దోమల నియంత్రణకు ప్రత్యేక చర్యలు



దోమల నియంత్రణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జ్వరపీడితుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేపట్టాం. జ్వరపీడితులకు అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నాం. గత ఏడాది వ్యాధులు సోకిన ప్రాంతాలను పరిశీలించి ముందు జాగ్రత్తలను తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించాం. హైరిస్క్ ప్రాంతాల్లో సిబ్బందిని అప్రమత్తం చేశాం. పంచాయతీ, కార్పొరేషన్లతో సమన్వయంగా చేసుకుని దోమల నియంత్రణ, పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం.

– డాక్టర్ కొర్రా విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ముఖ్యం

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చాలా ముఖ్యమని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అటవీ శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్, ఏపీ టూరిజం, జిల్లా క్రీడాభివృద్ధి, టిడ్కో శాఖలతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అందాల్సిన సేవల్లో కొన్నిసార్లు వివిధ శాఖల సమన్వయం అవసరమన్నారు. ముఖ్యంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికలాంటి అంశాల్లో ఇది మరింత కీలకమన్నారు. ఒకరికొకరు సహకరించుకుంటూ అభిప్రాయ భేదాలు లేకుండా పని చేయాలని సూచించారు. అంతిమంగా ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ఉండాలని పేర్కొన్నారు. ఏ శాఖలోనైనా, ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని తెలిపారు. తమ తమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి, సమస్యలపై అధికారులు అవగాహన పెంచుకోవాలని తెలిపారు. డీఎఫ్ఓ మహబూబ్ బాషా, డీఎస్ఓ పి.నరసింహారావు, టూరిజం అధికారి నాయుడమ్మ పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలి: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2000, గరిష్ఠ ధర రూ.3800, మోడల్ ధర రూ.3000 వరకు పలికింది.

న్యూస్‌రీల్

విద్యార్థులందరికీ కిట్లు అందించాలి



ముప్పాళ్ళ: పాఠశాలల్లోని విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్‌ను అందించాలని ప్రోగ్రాం రాష్ట్ర పరిశీలకులు వనజ పేర్కొన్నారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని స్టూడెంట్ కిట్ స్టాక్ పాయింట్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. వస్తువుల నాణ్యత, రికార్డులను తనిఖీ చేశారు. ఏమైనా ఇబ్బందులుంటే తమకు చెప్పాలన్నారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ ఎంఈవో శ్రీనివాసరావు, రాఘవేంద్రరావు, ప్రధానోపాధ్యాయురాలు నాగేంద్రమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బియ్యం, కందిపప్పు విక్రయాలు

నరసరావుపేట: నిత్యావసర సరకుల ధరల నియంత్రణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఎనిమిది చోట్ల నాణ్యమైన బియ్యం, కందిపప్పు ప్రత్యేక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ బుధవారం పేర్కొన్నారు. చిలకలూరిపేటలోని రైతుబజారు, స్పెన్సర్, నరసరావుపేటలో పల్నాడు రోడ్డు రిలయన్స్ స్మార్టు కేంద్రం వద్ద, గాయత్రి కాంప్లెక్స్ చిత్రాలయ దగ్గర, వినుకొండ రిలయన్స్ స్మార్ట్, ఎండీవో కార్యాలయం, పిడుగురాళ్లలో రిలయన్స్ స్మార్టు, ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఈ కేంద్రాలు ఉంటాయన్నారు. బహిరంగ మార్కెట్‌లో కేజీ రూ.55.85లు ఉన్న ఫైన్‌రకం బియ్యం ఇక్కడ రూ.49కి, ముడి, రా రైస్ రూ.52.40 ఉండగా ఇక్కడ రూ.48కి విక్రయిస్తామన్నారు. కేజీ రూ.174 పలికే దేశవాళీ కందిపప్పును రూ.160కు లభిస్తుందని చెప్పారు. గురువారం నుంచి ఒక ఆధార్ కార్డుపై 5 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు ఇస్తారన్నారు.

డీఈఓ పాఠశాలల సందర్శన



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలను డీఈఓ పి.శైలజ బుధవారం సందర్శించారు. తొలుత పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం నాడు–నేడు పనులను, విద్యార్థులకు అందజేస్తున్న స్టూడెంట్స్ కిట్స్‌ను పరిశీలించి, మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని స్వయంగా తెలుసుకుని, విద్యార్థులతో కలసి భోజనం చేశారు. అనంతరం రేవేంద్రపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఆమె వెంట దుగ్గిరాల ఎంఈఓలు కాజా శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి 'సీఐఎస్ఈ' త్రో బాల్ పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల స్థాయి సీఐఎస్ఈ పాఠశాలల త్రోబాల్ పోటీలు గురువారం నుంచి రెండు రోజులపాటు నిర్వహిస్తామని పోటీల నిర్వహణ కార్యదర్శి ఫాదర్ భరత్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–14, 17, 19 బాలికల విభాగాల్లో స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఉమ్మడి రాష్ట్రాల నుంచి దాదాపు 600 మంది పాల్గొంటారన్నారు. ఫాదర్ డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య పోటీలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

యార్డుకు 31,500 బస్తాల మిర్చి రాక

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 31,500 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 29,544 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 19,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,000 నుంచి రూ. 16,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,500 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 17,843 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

48 గంటల్లో డయేరియా తగ్గేలా చర్యలు

- అధికారులకు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశం
- కలుషిత నీరు, అధ్వాన డ్రైనేజీతోనే డయేరియా వ్యాప్తి
- ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచన
- అధికారులు ఇకనైనా పనిచేయాలి: ఎమ్మెల్యే యరపతినేని



లెనిన్ నగర్‌లో డయేరియా ప్రబలిన ప్రాంతంలోని వాటర్ బోరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల: పట్టణంలో డయేరియా ప్రభావం 48 గంటల్లో తగ్గేలా అధికారులు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. పట్టణంలోని డయేరియా ప్రబలిన ప్రాంతాలలో కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం పర్యటించారు. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. అనంతరం లెనిన్ నగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తాగునీరు కలుషితం కావడం, అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థ కారణంగానే లెనిన్ నగర్, మారుతీ నగర్ తదితర ప్రాంతాల్లో డయేరియా ప్రబలిందని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ చల్లటం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ డయేరియా తగ్గుముఖం పట్టలేదన్నారు. వైద్యులు ప్రతి ఇంటికి వెళ్లి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించాలన్నారు. మున్సిపాలిటీ అధికారులు వెంటనే కాలువల్లో చెత్తను తొలగించాలని ఆదేశించారు. మురుగు నీటి పారుదల సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గురజాల ఆర్‌డీవో రెండు రోజుల పాటు పిడుగురాళ్ల పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డయేరియా తగ్గుముఖం పట్టేలా కిందిస్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు.

కాలువల్లో చెత్త తొలగింపు ఎన్నడు?

గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై మున్సిపల్ అధికారులు సక్రమంగా పర్యవేక్షించలేదని ఆరోపించారు. కాలువల్లో వ్యర్థాల తొలగింపు, చెత్త సేకరించటం వంటి పనులు సిబ్బంది సక్రమంగా చేయటం లేదని తెలిపారు. తాము వస్తున్నామని తెలిసి బ్లీచింగ్ పౌడర్ మాత్రం చల్లారని పేర్కొన్నారు. డయేరియా తగ్గేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం కావాలన్నా తాను చేస్తానని చెప్పారు. వైద్య శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనకు, కలెక్టర్‌కు డయేరియా కేసుల వివరాలను అందజేయాలని సూచించారు. డయేరియా వల్ల చిన్న కుటుంబాల్లో ఓ వ్యక్తి చనిపోతే వారి బాధ చెప్పలేనిదని, ఇకపై మరణాలు సంభవించకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. పట్టణంలో కుక్కల బెడద కూడా ఎక్కువగా ఉందని, వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి, ఆర్‌డీవో రమాకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, డాక్టర్ రవితేజ, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నారులో నాణ్యత.. రైతన్నకు భద్రత!

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అన్నదాతలకు భద్రత లభిస్తోంది. నాటి నిబంధనే వారు నేటికీ ఆర్థికంగా నష్టపోకుండా అండగా నిలుస్తోంది. పుట్టగొడుగుల్లా వెలుస్తూ రైతులకు నాసిరకం నారు విక్రయించే నర్సరీలకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముకుతాడు వేసింది. ప్రతి నర్సరీకి లైసెన్స్ తప్పనిసరి చేసి అక్రమాలకు చెక్ పెట్టింది. ఫలితంగా ప్రస్తుతం నర్సరీలలో నాణ్యమైన నారు దొరుకుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- నర్సరీలలో అడ్డగోలుగా పెంపకానికి చెక్
- లైసెన్స్ తప్పనిసరి చేసిన నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఉద్యాన అధికారుల ముమ్మర తనిఖీలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



కంకణాలపల్లి వద్ద షేడ్ నెట్ నర్సరీ నిర్వాహకుడికి సూచనలిస్తున్న ఉద్యాన అధికారి నవీన్ కుమార్

సత్తెనపల్లి: కొన్నేళ్లుగా మిరప సహా పలు కూరగాయల మొక్కలకు రైతులు నర్సరీలపైనే ఆధారపడుతున్నారు. ఇదే అదనుగా భావించిన కొందరు ఇబ్బడిముబ్బడిగా నర్సరీలు ఏర్పాటు చేసి నాసిరకం విత్తనాలతో నారు పెంచి రైతులకు అంటగట్టేవారు. ఆ నారు కొనుగోలు చేసి నాటుకున్న అన్నదాతలు దిగుబడులు రాక ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయేవారు. సమస్యను గుర్తించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2022–23లో ఆంధ్రప్రదేశ్ ఉద్యాన నర్సరీల రిజిస్ట్రీకరణ (క్రమబద్ధీకరణ) చట్టం–2010కి సమూల మార్పులు చేసింది. ఫలితంగా నాణ్యమైన నారు పెంపకానికి అవకాశం ఏర్పడింది.

ప్రతి నర్సరీకి అనుమతి తప్పనిసరి...

సవరించిన చట్టం ప్రకారం ప్రతి నర్సరీకి ఉద్యాన శాఖ నుంచి విధిగా లైసెన్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకోకుండా నర్సరీ పెడితే దానిపై చర్యలు తీసుకునే అధికారం యంత్రాంగానికి ఉంది. 2022–23 నుంచి పండ్లు, మిర్చి, టమాట, ఇతర కూరగాయల నర్సరీలకు ఈ నిబంధన తప్పనిసరి చేశారు. ప్రస్తుతం సత్తెనపల్లి ఉద్యాన శాఖ పరిధిలోని మూడు మండలాల్లో 65 నర్సరీలు కొనసాగుతున్నాయి. సత్తెనపల్లి మండలంలో 34, ముప్పాళ్ళ– 5, క్రోసూరు మండలంలో 26 ఉన్నాయి. ఇలా ప్రతి నర్సరీ యజమాని తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అధికారులు గుర్తుచేశారు.

ముమ్మరంగా నారు పెంపకం...

ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు. మే నెలతోపాటు జూన్ నెలలో కూడా అడపా దడపా వర్షాలు పడటంతో బావులు, బోర్లలో భూగర్భ జలాలు కొంత పెరిగాయి. ఉద్యాన పంటల సాగు పెరుగుతుండడంతో ప్రస్తుతం నర్సరీలలో నారు పెంపకం ఊపందుకుంది. మిర్చి తదితర నార్లు నర్సరీలో పెంచేందుకు షేడ్‌నెట్లను సిద్ధం చేశారు. రైతులు కొనుగోలు సమయంలో విత్తన కంపెనీలు, రకాలు, మొక్కలు పెంచిన విధానం తదితర వాటిని పరిశీలించాల్సిన అవసరం ఉంది. మొక్కల కొనుగోలు సమయంలో రైతులు నర్సరీ నిర్వాహకుల నుంచి తగిన బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. పంటకాలం పూర్తయ్యే వరకు ఆ బిల్లును జాగ్రత్తగా ఉంచుకోవాలి. నర్సరీల చట్టానికి పదును పెట్టిన తర్వాత ఉద్యాన అధికారుల వైపు నుంచి కూడా పర్యవేక్షణ పెరిగింది. ప్రతినెలా తనిఖీలు చేస్తున్నారు. రికార్డులను కూడా పరిశీలిస్తున్నారు. ఫలితంగా నర్సరీలలో పెంచుతున్న నారులో నాణ్యత పెరిగింది. చట్టం వల్ల అక్రమాలకు చెక్ పెట్టినట్లు అయింది. అన్నదాత ఆర్థికంగా నష్టపోకుండా రక్షణ దొరికింది.

లైసెన్సు లేకపోతే చర్యలు



రైతుల అభ్యున్నతే లక్ష్యంగా గత ప్రభుత్వం నర్సరీల చట్టంలో సమూల మార్పులు చేసింది. నర్సరీలకు విధిగా లైసెన్స్ తీసుకోవాలి. దీనికోసం రూ. 1,000 ఫీజు చెల్లించాలి. తనిఖీలు చేసినప్పుడు అనుమతి లేదని తెలిస్తే చర్యలు తప్పవు. ఉద్యాన అధికారి నెలకోసారి నర్సరీలను తనిఖీ చేస్తారు. బుధవారం సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి, ధూళిపాళ్లలోని షేడ్ నెట్ నర్సరీలను పరిశీలించాం. లైసెన్స్ తప్పనిసరి అని మరోసారి గుర్తు చేశాం.

– దాసరి నవీన్ కుమార్, ఉద్యాన అధికారి, సత్తెనపల్లి

పెళ్లైన ఐదు నెలలకే యువకుడి దుర్మరణం

- నవ దంపతుల బైకును ఢీకొన్న ఆటో
- భర్త మృతి, తీవ్రంగా గాయపడిన భార్య



ప్రమాద స్థలంలో వెంకటరమణ మృతదేహం



తీవ్రగాయాలపాలైన డి.శ్రీ

నాదెండ్ల: వివాహమైన ఐదు నెలలకే ఆ యువకుడికి నూరేళ్లు నిండాయి. రోడ్డు ప్రమాదం రూపంలో విధి ఓ నవ జంటను విడదీసింది. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న జంటను ఓ ఆటో ఢీకొట్టిన ఘటనలో భర్త దుర్మరణం పాలవగా, భార్య తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఈ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఎస్ఐ జె. బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. ప్రకాశం జిల్లా పెదఆరవీడు మండలం, రామాయపాలెం గ్రామానికి చెందిన పోరుమళ్ల వెంకటరమణ (26) ఇళ్లకు సీలింగ్ పనులు చేస్తుంటాడు. ఐదు నెలల క్రితం డి.శ్రీ అనే యువతితో వివాహమైంది. మంగళవారం దంపతులు బైక్‌పై గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి స్వగ్రామానికి వస్తున్నారు. అదే సమయంలో బోర్ల చిరంజీవి తన బాడీ ఆటోలో నరసరావుపేట నుంచి చేబ్రోలు మండలం శలపాడుకు వెళ్తున్నారు. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆటో, ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వెంకటరమణ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. భార్య డి.శ్రీ తీవ్రంగా గాయపడింది. ప్రమాదం జరిగిన సమయంలో నరసరావుపేట రూరల్ మండలంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాతులూరు గ్రామానికి చెందిన పోపూరి ప్రకాశరావు అక్కడకు చేరుకుని 108కు సమాచారమిచ్చారు. గాయాలపాలైన డి.శ్రీని చికిత్స నిమిత్తం నరసరావుపేట ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు పంపారు. వెంకటరమణ మృతదేహాన్ని నరసరావుపేట ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతలో రాజీపడొద్దు

సమగ్రశిక్ష ఏపీసీ విజయలక్ష్మి



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బలవర్థకమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు అమలు చేస్తున్న పీఎం పోషణ్ (మధ్యాహ్న భోజన పథకం) నాణ్యతలో రాజీపడొద్దని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త జి.విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం స్తంభాలగరువులోని చేబ్రోలు మహాలక్ష్మీ పుల్లయ్య–నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను సందర్శించిన విజయలక్ష్మి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి, ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఈసందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ మెనూ పాటించి, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించాలని సూచించారు. ఆమె వెంట ఎంఈఓ జ్యోతికిరణ్, హెచ్ఎం శ్రీనివాసరావు ఉన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):దుర్గమ్మ సన్నిధిలో అనంతపురానికి చెందిన ఎస్.రాజశేఖర్ బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై సాయంత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. పలువురు చిన్నారులు అమ్మవారి కీర్తనలకు చక్కటి హావభావాలతో, లయబద్ధంగా చేసిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం శిష్య బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందించారు.

క్లుప్తంగా

తొలి ఇన్నింగ్స్‌లో 198కి కర్నూలు ఆలౌట్



జె.నాగకిషోర్, 4 వికెట్లు, కడప జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న అండర్-16 బాలుర అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలలో భాగంగా బుధవారం కర్నూలు, వైఎస్సార్ కడప జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో 198 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని పి.రోహిత్‌గౌడ్ 53 పరుగులు సాధించాడు. కడప జిల్లా బౌలర్ జె.నాగకిషోర్ 17 ఓవర్లలో 46 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తన ఖాతాలో వేసుకొన్నాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4 వికెట్లు కోల్పోయి 21 పరుగులు సాధించింది. గురువారం రెండో రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

అమరేశ్వరాలయంలో సర్దుమణిగిన వివాదం

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో భక్తుడి అత్యుత్సాహం వల్ల మొదలైన వివాదం ఎట్టకేలకు సర్దుమణిగింది. ఈ సంఘటనపై ఈవో వేమూరి గోపీనాథ శర్మ అందించిన సమాచారం ప్రకారం.. బుధవారం ఉదయం కర్నూలు జిల్లాకు చెందిన భక్తుడు అంతరాలయ దర్శనం కోసం దేవాలయంలోనికి ప్రవేశించారు. ఈ క్రమంలో గర్భాలయంలో అర్చకులు, సిబ్బంది ఎవరూ లేక పోవటంతో లోనికి ప్రవేశించారు. అర్చకుడు దీన్ని గమనించి భక్తుడిని బయటకు లాగి చేయి చేసుకున్నారు. దీనిపై ఈవో గోపీనాథశర్మకు భక్తుడు ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై ఈవో మాట్లాడుతూ గర్భాలయంలోకి ఇతరులకు ప్రవేశం లేదని చెప్పారు. ఇది అపచారమన్నారు. భక్తుడిపై అర్చకుడు కూడా దాడి చేయకూడదని పేర్కొన్నారు. ఈ సంఘటనపై అర్చకులకు షోకాజ్ నోటీసు ఇచ్చామని తెలిపారు. గర్భాలయంలో జరిగిన అపచారానికి సంప్రోక్షణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించామన్నారు. గర్భాలయాన్ని నదీజలాలతో శుభ్రం చేసిన అనంతరం పుణ్యాహవాచన జలాలతో శుద్ధి చేశామని చెప్పారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా సిబ్బంది, అర్చకులు తమ విధులను కచ్చితంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.

రేపు ఏఎంజీలో జాబ్ మేళా

చిలకలూరిపేట: ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ స్వచ్ఛంద సంస్థ ప్రాంగణంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వి.మణిదీపక్ తెలిపారు. మేళాలో వరుణ్ మోటార్స్, ఎస్‌ఫీల్డ్, అశోక్ లేలాండ్, జోసిల్, పెప్సీ, అమర్‌రాజా, క్యాప్‌స్టోన్ కన్సల్టెన్సీ, శ్రీసిటీలోని పలు కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఐటీఐలో ఎలక్ట్రికల్, ఫిట్టర్, డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, సివిల్ తదితర ట్రేడ్లు పూర్తి చేసిన అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. వివరాలకు ఫోన్ నంబర్లు 99666 52250, 63008 34023 లలో సంప్రదించాలని సూచించారు.

రాజకీయ వేధింపులు ఆపండి

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- బలవంతపు రాజీనామాలు తగవు
- ఉద్యోగులకు తప్పని ఇబ్బందులు
- కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేత



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళుతున్న నాయకులు, కార్మికులు

నరసరావుపేట: రాష్ట్రంలోని పలు శాఖల్లో ఉద్యోగులపై రాజకీయ వేధింపులు వెంటనే ఆపాలని సీఐటీయూ ప్రతినిధులు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వారు పేర్కొన్నారు. అఖిల భారతీయ కోర్కెల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్, అంగన్వాడీ, మధ్యాహ్న భోజనం, లారీ వర్కర్లు, డ్వాక్రా యానిమేటర్లు బుధవారం మున్సిపల్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ప్రవేశద్వారం వద్ద రోడ్డుపై బైఠాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రధాన కార్యదర్శి అంజనేయులు నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల్లో నూతన ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయని గుర్తుచేశారు. గతంలో బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులపై గ్రామస్థాయిలో వేధింపులు అధికం అయ్యాయన్నారు. రాజీనామాలు చేయాలని బలవంతం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, ప్రైవేటీకరణ, జాతీయ నగదు బదిలీకరణ పథకాలను ఆపాలన్నారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నభోజనం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష, వెలుగు, మెప్మా, ఉపాధి హామీ, 108, 104 పథకాల కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పేర్కొన్నారు. వారిపై రాజకీయ వేధింపులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, కంటింజెంట్, పార్టుటైమ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. ట్రాన్స్‌పోర్టు కార్మికులకు ఉరితాడుగా మారనున్న భారత న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వీఆర్యేలకు టైమ్‌స్కేలు ఏర్పాటుచేసి నామినీలను వీఆర్యేలుగా గుర్తించాలని చెప్పారు. అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ స్కీమును రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డి.శివకుమారి, శిలార్‌మసూద్ పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పది కిలోల గంజాయి పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి, ద్విచక్రవాహనం, సెల్‌ఫోన్‌లు

అమరావతి: మండల పరిధిలోని దిడుగు గ్రామ శివారులో పది కిలోల గంజాయి రవాణా చేస్తుండగా మంగళవారం రాత్రి అమరావతి పోలీసులు పట్టుకున్నారు. అమరావతి సీఐ ఎ.వి. బ్రహ్మం ఇచ్చిన సమాచారం మేరకు.. మంగళవారం సత్తెనపల్లి డీఎస్పీ గురునాథబాబుకు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో అప్రమత్తమైన అమరావతి పోలీసులు దిడుగు గ్రామ శివారు సత్రం సెంటర్‌లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ద్విచక్ర వాహనంపై వస్తున్న ముగ్గురిని ఆపారు. వారి వద్ద ఒక్కొక్కటి రెండు కిలోల బరువు కలిగిన ఐదు గంజాయి ప్యాకెట్లు లభించాయి. వారిని దిడుగు గ్రామానికి చెందిన దున్నా ప్రభుదాస్, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు మండలం సాయినగర్‌కు చెందిన అడెంగుల రవి కుమార్, గోర్లె బాబులుగా గుర్తించారు. ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్‌లను కూడా స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎ.వి. బ్రహ్మం మాట్లాడుతూ నిందితులపై బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. వీరిని రిమాండ్ నిమిత్తం సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

ఓటమి దిగులుతో వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి



చీకుల పిచ్చిరెడ్డి (ఫైల్)

నరసరావుపేట: పల్నాడు జిల్లా నరసరావుపేట ప్రకాష్ నగర్‌కు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త చీకుల పిచ్చిరెడ్డి (48) గుండెపోటుతో మంగళవారం మృతి చెందారు. తన గృహంలో మొదటిసారి గుండెపోటుకు గురైన పిచ్చిరెడ్డి తీవ్ర అస్వస్థతకు గురికావటంతో వెంటనే వైద్యశాలకు తరలిస్తుండగా ప్రాణాలు కోల్పోయారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఓటమి, వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాలేదనే బెంగతో తన భర్త కొన్నిరోజులుగా బాధపడుతూ గుండెపోటుకు గురయ్యారని భార్య రమాదేవి, కుమారుడు హర్షవర్ధనరెడ్డి తెలిపారు. అందరికీ తలలో నాలుకలా వ్యవహరిస్తూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పనిచేసే పిచ్చిరెడ్డి మృతి ప్రకాష్‌నగర్‌కు చెందిన పార్టీ వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. మృతదేహాన్ని ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గం సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. హర్షవర్ధనరెడ్డి వలంటీరుగా పనిచేశారు. పలువురు నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ప్రకృతి సాగు పంట పరిశీలన



పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి తదితరులు

పెద్దకూరపాడు: మండలంలో పెద్దకూరపాడు యూనిట్‌లోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో పీఎండీఎస్ పంటను ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అమలకుమారి బుధవారం పరిశీలించారు. డీపీఎం మాట్లాడుతూ ఈ పంట 45 రోజుల తర్వాత పశుగ్రాసంగా ఉపయోగించుకోవచ్చన్నారు. ఆ తర్వాత భూమిలో కలియ దున్నుకోవచ్చని చెప్పారు. పీఎండీఎస్ పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవడం ద్వారా భూమి సారవంతం అవుతుందని, తర్వాత పంటలు ఆరోగ్యంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆరు పత్తి సాళ్లకు ఒక సాలు కంది పెట్టుకోవాలని, పంటకు రక్షణ కవచంలా చుట్టూ బోర్డర్ క్రాప్‌గా మూడు వరుసలు జొన్న, సజ్జ వంటివి వేసుకోవాలన్నారు. పత్తిలో సాళ్ల మధ్యలో సజ్జ, గోరు చిక్కుడు, బెండ, మినుము, పెసర, అలసందలు రెండు వరుసలు పెట్టుకోవాలని సూచించారు. అంతేకాకుండా పత్తి మొక్కల మధ్యలో ఆకు కూరలు కూడా సాగు చేయవచ్చని చెప్పారు. ఇలా అంతర పంటలు వేసుకోవడం వల్ల జీవ వైవిధ్యం ఏర్పడి భూసారం మెరుగుపడి రసాయన ఎరువుల అవసరం ఉండదన్నారు. పెద్దకూరపాడు మండల వ్యవసాయ అధికారి శాంతి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పెద్దకూరపాడు యూనిట్ ఇన్‌చార్జి అమూల్య, రైతులు పాల్గొన్నారు.

డయేరియాతో మరో వ్యక్తి మృతి



బండారు వెంకటేశ్వర్లు (ఫైల్)

పిడుగురాళ్ల: డయేరియాతో మరో వ్యక్తి మృతి చెందిన సంఘటన లెనిన్ నగర్‌లో చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని లెనిన్ నగర్‌కు చెందిన సున్నపు బట్టీలో పని చేసే బండారు వెంకటేశ్వర్లు (55) మూడు రోజుల నుంచి వాంతులు, విరోచనాలతో ఇబ్బంది పడుతున్నారు. పట్టణంలోని ఓ వైద్యశాలలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించింది. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు.

అటవీ సంరక్షణ అందరి బాధ్యత

జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు



విత్తన బంతిని పరిశీలిస్తున్న డీఎఫ్‌వో రామచంద్రరావు, పక్కన పర్యావరణ వేత్త అంకారావు



విద్యార్థులకు ప్రకృతి పాఠం బోధిస్తున్న డీఎఫ్‌వో రామచంద్రరావు

కారెంపూడి: అడవుల రక్షణ, వన్యప్రాణి సంరక్షణపై ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్. రామచంద్రరావు పిలుపునిచ్చారు. కారెంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి) నల్లమలలో కోటి విత్తన బంతులు చల్లాలని సంకల్పించారు. ఈ మేరకు బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డీఎఫ్‌వో రామచంద్రరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మొక్కలు పెరగడానికి అనువైన ప్రాంతంలో కొన్ని విత్తన బంతులను డీఎఫ్‌వో చల్లారు. అంకారావు స్వచ్ఛందంగా అడవుల అభివృద్ధికి చేస్తున్న కృషిని అభినందించారు. ఇలాంటి నిస్వార్థ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని, అందుకే అటవీశాఖ పరంగా కూడా సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు. యువత, విద్యార్థులు కూడా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం కారెంపూడి బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఆయన ప్రకృతి పాఠాలు బోధించారు. అడవుల సంరక్షణ, పర్యావరణ రక్షణ, వన్యప్రాణులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ ప్రాథమిక కర్తవ్యంగా భావించాలన్నారు. కొమెర అంకారావు విద్యార్థులకు సీడ్ బాల్స్ తయారీపై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి ఒక్కో సీడ్ బాల్ తయారు చేసి మొక్కలు పెరిగేందుకు కృషి చేస్తే ప్రాణికోటి జీవించడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుందని వివరించారు. కార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ అధికారి వెంకటరమణ, డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీహరికుమార్, బీట్ అధికారి అమీర్ జానీ బాషా, అటవీ శాఖ సిబ్బంది, వన సంరక్షణ సమితి సభ్యులు, హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతారామయ్య హైస్కూల్ లో విద్యాభ్యాసం

నా జీవితంలో ఎంతో ముఖ్యమైనది



డీజీపీ ద్వారకా తిరుమలరావుతో హైస్కూల్ మిత్ర బృందం

- డీజీపీ ద్వారకా తిరుమలరావు
- మంగళగిరిలోని కార్యాలయంలో డీజీపీని కలిసిన హైస్కూల్ మిత్ర బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీపాటిబండ్ల సీతారామయ్య పాఠశాల తన జీవితంలో ఎంతో ప్రాధాన్యం సంతరించుకుందని, అక్కడ తాను చదువుకున్న రోజులు మరువలేనివని రాష్ట్ర డీజీపీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు అన్నారు. గుంటూరులోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్లో ద్వారకా తిరుమలరావుతో కలిసి చదువుకున్న (1974-79) సహచర విద్యార్థుల బృందం బుధవారం మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో ఆయన్ను కలిశారు. ఈసందర్భంగా ఒకనాటి తన మిత్రులను కలిసిన ఆనందంలో డీజీపీ ద్వారకా తిరుమలరావు వారిని పేరు, పేరునా పలుకరించి, విద్యార్థి దశలోని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. శ్రీ పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్‌తో తన అమూల్యమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తన పాఠశాల రోజులే జీవితంలో అత్యుత్తమమైన రోజులని మిత్రులతో అన్నారు. పాఠశాల దశలో ఏర్పడిన స్నేహం విడదీయరానిదని, ఎంతో విశ్వసనీయమైనదని అన్నారు. ఉద్యోగ బాధ్యతల నిర్వహణలో ఏ స్థాయిలో, ఎక్కడ ఉన్నా తాను తన స్నేహితులను ఎప్పుడూ విడిచిపెట్టలేదని పేర్కొన్నారు. డీజీపీని కలిసినవారిలో చిన్ననాటి స్నేహితులు మేకపాటి శ్రీనివాస్, సురేంద్ర, సయ్యద్‌జానీ, శివరావు, శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

పవర్ లిఫ్టర్ జ్ఞానదివ్యకు అభినందనలు



జ్ఞానదివ్యకు లెదర్ బ్యాగ్‌ను అందజేస్తున్న తులసి ధర్మచరణ్

కొరిటిపాడు(గుంటూరు): తెనాలి మండలం కఠేవరం గ్రామానికి చెందిన పవర్ లిఫ్టర్ నాగం జ్ఞాన దివ్యను వేద సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తులసి ధర్మచరణ్ అరండల్‌పేటలోని వేద సీడ్స్ కార్యాలయంలో బుధవారం అభినందించారు. జూన్ 6 నుంచి 9వ తేదీ వరకు రాజస్థాన్‌లో జరిగిన 13వ నేషనల్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో 84 ప్లస్ కిలోల సబ్ జూనియర్ విభాగంలో జ్ఞాన దివ్య పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన సందర్భంగా ధర్మచరణ్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తులసి ధర్మచరణ్ మాట్లాడుతూ తెలుగు క్రీడాకారులకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందజేయాల్సిన అవసరం ఉందన్నారు. పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు మహిళ అత్యున్నత స్థాయిలో రాణించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఈ ఏడాది అక్టోబర్‌లో జరగబోయే ఇంటర్నేషనల్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌కు వెళ్లనున్న జ్ఞానదివ్యకు ఆర్థికంగా తోడ్పాటును అందిస్తానని ధర్మచరణ్ హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలను సాధించి దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జ్ఞానదివ్య తండ్రి నాగం వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్షలు విస్తృతం చేయండి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించి ప్రాథమిక దశలోనే గుర్తించేలా స్క్రీనింగ్ పరీక్షలు విస్తృతంగా చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. బుధవారం గుంటూరు మెడికల్ కాలేజ్ ఎస్.పి.ఎం గ్యాలరీలో ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్యాధికారులకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'సబ్ డిస్ట్రిక్ లెవెల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం' ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లావ్యాప్తంగా వైద్యులు, వైద్యసిబ్బందికి ఆరు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాల ద్వారా ప్రాథమిక దశలోనే క్యాన్సర్ లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించామని చెప్పారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి, వ్యాధి తీవ్రతను బట్టి వివిధ స్థాయి ఆసుపత్రులకు చికిత్స కోసం రిఫర్ చేయాలని తెలిపారు. ప్రాథమిక దశలోనే గుర్తించి వ్యాధి నుంచి ప్రజలను రక్షించాలని వెల్లడించారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్, ఎస్‌పీఎం విభాగాధిపతి డాక్టర్ సీతాకుమారి, గైనిక్ ప్రొఫెసర్ డాక్టర్ ఆదిలక్ష్మి, ఎన్సీడీ జిల్లా అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బారాజు తదితరులు పాల్గొన్నారు.

13న ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం



బ్రోచర్ విడుదల చేస్తున్న రంగారావు తదితరులు

నగరంపాలెం: ఎన్టీఆర్ జయంతి వేడుకల్లో భాగంగా కళా దర్బార్ (అమరావతి) ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులకు ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కళాదర్బార్ ప్రోగ్రాం కమిటీ చైర్మన్, కళాసామ్రాట్ పాతూరి రంగారావు తెలిపారు. అరండల్‌పేట ఆరో వీధిలో బుధవారం జరిగిన విలేకర్ల సమావేశంలో బ్రోచర్‌ను విడుదల చేశారు. రంగారావు మాట్లాడుతూ ఈనెల 13 సాయంత్రం 6 గంటలకు గుంటూరు మార్కెట్ కూడలిలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ముఖ్యఅతిథిగా ఎన్టీఆర్ వారసులు నందమూరి రామకృష్ణ హాజరై, పురస్కారాలను ప్రదానం చేయనున్నారని పేర్కొన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు టి.డి.జనార్ధన్, బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం, టీడీపీ స్టేట్ ప్రోగ్రాం కార్యదర్శి మూలక సత్యవాణి ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారని అన్నారు. ఈ ప్రతిభా పురస్కారాలను కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, మండలి బుద్ధప్రసాద్, గళ్లా మాధవి, నసీర్ అహ్మద్, బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నక్కా ఆనందబాబు, జీవీ ఆంజనేయులు, ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని శ్రీనివాసరావు, భాష్యం ప్రవీణ్, చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మారెడ్డిలకు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రముఖ గాయకులతో సినీ సంగీత విభావరి ఉంటుందని అన్నారు. సమావేశంలో పంచుమర్తి కల్పన, వి.పావని, బి.చంద్రబాబు, కె.బాబురావు, ధర్మనారాయణసింగ్ పాల్గొన్నారు.

మూతపడిన వాటర్ ప్లాంట్

- టీడీపీ నేతల నిర్వాకం ఫలితం
- తాగునీటి కోసం ప్రజల ఇబ్బందులు



కొండమోడులో మూసివేసిన వాటర్ ప్లాంట్

రాజుపాలెం: నిర్విరామంగా సాగే వాటర్ ప్లాంట్ తెలుగుదేశం పార్టీ నాయకుల నిర్వాకంతో మూత పడింది. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం కోటనెమలిపురి పంచాయతీ పరిధిలోని కొండమోడు జంక్షన్‌లో బాలవికాస్ సహకారం, పంచాయతీ నిధులతో సంయుక్తంగా వాటర్ ప్లాంట్‌ను 2021లో ఏర్పాటు చేశారు. కొండమోడులో ఉండే పసుపులేటి గోవర్ధన్ ఈ ప్లాంట్ నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్లాంట్ కొనసాగుతోంది. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పార్టీ నాయకుల కన్ను ప్లాంట్‌పై పడింది. దానిని స్వాధీనం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావుపై ఒత్తిడి తెచ్చారు. చేసేది లేక పంచాయతీ కార్యదర్శి వారం రోజుల క్రితం ప్లాంట్‌ను స్వాధీనం చేసుకుని తాళాలు వేశారు. ప్లాంట్ మూసివేయడంతో ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. రోజూ ఈ ప్లాంట్ నుంచి సుమారు 100 క్యాన్‌ల తాగునీటిని తీసుకెళుతుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్లాంట్‌ను తెరిపించాలని ప్రజలు కోరుతున్నారు.

జెన్‌కో ఉద్యోగికి కేఎల్‌యూ డాక్టరేట్



ఉలవపల్లి గంగాధర రెడ్డి(ఫైల్)

తాడేపల్లిరూరల్: ఏపీ జెన్‌కోలోని శిక్షణకేంద్రంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉలవపల్లి గంగాధర్ రెడ్డికి బుధవారం తాడేపల్లి రూరల్‌పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను అందించింది. ఆపన్నహస్తం సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఏపీ జెన్‌కోలోని శిక్షణకేంద్రంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ కెమిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న ఉలవపల్లి గంగాధర్ రెడ్డికి డాక్టరేట్ రావడం ఆనందంగా ఉందన్నారు. జీవ రసాయన పద్ధతుల ద్వారా బొగ్గు నాణ్యతను పెంచడానికి చేసిన కృషికి గానూ ఈ డాక్టరేట్ దక్కిందని అన్నారు. ఆపన్న హస్తం అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, కొన్ని సంవత్సరాలుగా పాంచజన్యం పేరుతో భగవద్గీతా జ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేస్తున్నారని తెలిపారు.

దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

నరసరావుపేట టౌన్: దాడి కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమాన విధిస్తూ 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. సత్యశ్రీ బుధవారం తీర్పు చెప్పారు. చిలకలూరిపేట పట్టణానికి చెందిన గోనుగుంట్ల వెంకయ్యపై అదే ప్రాంతానికి చెందిన దారాబాబు 2018 జూలై 15న స్వల్ప వివాద నేపథ్యంలో దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిపై అభియోగపత్రం దాఖలు చేశారు. నేరం రుజువు కావటంతో చిలకలూరిపేట జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.500 జరిమాన విధిస్తూ తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుపై నిందితుడు జిల్లా కోర్టులో అప్పీల్ చేసుకోవడంతో దిగువ కోర్టు విధించిన శిక్షను యథావిధిగా ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.